తెలుగుకళా సమితి (న్యూజెర్సీ) వారి 1986 మినీ కథల పోటీలో రు.250/-లు బహుమతి పొందిన కథ

# సంగీతజ్ఞానమూ...

శ్రీగిరిరాజు విజయలక్ష్మి

"స రి గ మ ప ద ని స"

"స రి గ మ ప ద ని స"

సరళీస్వరం మొదటిపాదంలోని ఒక్కొక్క స్వరాన్ని విడివిడిగా మాష్టారు చెప్పిన విధంగా ఖచ్చితంగా పలికింది సంగీత.

"స ని ద ప మ గ రి స"

"స ని ద ప మ గ రి స"

రెండో పాదాన్ని కూడా అపశృతులు లేకుండా పలికిందామె.

"అబ్బ! వెంటనే ఎంతచక్కగా అనేసిందో! చేరింది ఈ రోజే అయినా మొదటి సరళస్వరం మూడు కాలాల్లో పలకడానికి వారం రోజులు పట్టింది గదే మనకు" గుసగుసగా అనుకున్నారు అక్కడున్న అమ్మాయిలు కొందరు సంగీతవైపు ఆసక్తిగా చూస్తూ.

అరగంట సేపు ఆ స్వరాన్నే మళ్ళీ చెప్పించారు మాష్టారు సంగీతతో.

మిగిలిన అర్థగంటా కబుర్లతో కాలక్షేపం చేయించారు మాష్టారు.

పాఠం చెప్పే కాలం రోజు కొకగంట. పేరుకు గంటేకానీ, చెప్పేది అరగంటకూడా వుండేది కాదు.

ఒక రోజు వీణ, మరొక రోజు గాత్రం. అలా వుండేది పాఠం చెప్పడం.

పది సరళీస్వరాలు, జంటస్వరాలు, అలంకారాలూ, స్వరజతులూ, గీతాలూ, వర్ణాలూ నేర్చేసుకోవడం పెద్ద కష్టంగా ఏమీ అన్పించలేదు సంగీతకు.

సంగీతజ్ఞానం చిన్నతనం నుండే ఉందామెలో. వాళ్ళ అమ్మమ్మపాడే అధ్యాత్మ రామాయణ కీర్తనలు, తల్లీ దండ్రీ శుక్రవారాలు అమ్మవారివద్ద పాడే పాటలు-పసితనం నుంచి వినడంవల్ల చక్కగా పాడే జ్ఞానం కలిగింది ఆమెకు. ఒకటి రెండుసార్లు వింటేచాలు, కష్టంగా వున్న ఏ పాట బాణీ అయినా సరే ఠక్కున పట్టేసేది.

పెద్దయింతర్వాత స్కూల్లో, కాలేజీలో మంచి గాయనిగా పేరు తెచ్చుకున్నది సంగీత. కానీ శాస్త్రోక్తమైన సంగీతాన్నభ్యసించాలని కలలు గనేదామె.

బాలమురళీకృష్ణ, ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, ఎం.ఎల్. వసంతకుమారి, డి.కె. పట్టమ్మాళ్‌ల గాత్ర తీరులంటే మక్కువ.

విదేశీయుడైనా భారతీయ కర్నాటక సంగీతంలో నిష్ణాతుడైన జాన్ హిగ్గిన్స్ భాగవతార్ ఆమెకు ఆదర్శ ప్రాయుడు.

వాళ్ళందరిలాగా సంగీత విద్వాంసురాలు కావాలనే కోరిక ఆమె అంతరాంతరాలను తొలుస్తుండేది.

కానీ తండ్రి గతించడంతో బంధువుల దయాదాక్షిణ్యాలతో బ్రతకవలసిరావడం వల్ల, చదువుకోవడమే ఘనమైపోయింది.

ఆ తర్వాత కుటుంబ పోషణార్థం ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సంగీతం నేర్చుకోవాలనే తహతహ మాత్రం ఆమెను వదల్లేదు.

ప్రస్తుతం ఆర్థికంగా స్వతంత్రురాలు కాబట్టి ఏదో ఒక ఖర్చు తగ్గించుకుని అయినాసరే సంగీతం నేర్చుకోవాలని నిశ్చయించుకున్నది.

ఆ ఊళ్ళో వున్న కొందరు సంగీతకారులలో శేషాచార్యులుగారు సంగీతం బాగా చెప్పగలరని తెలియడంతో వారి వద్ద సంగీతం నేర్చుకోవడానికి ఉపక్రమించిందామె.

"రఘువంశ సుధాంబుధి చంద్ర శ్రీ ..." స్వరః మాష్టారితో సమానంగా కలిపి వీణపై వాయిస్తోంది రేఖ.

రేఖ వాళ్ళు బాగా డబ్బుగలవారు. వాళ్ళ అమ్మా, నాన్నా అప్పుడప్పుడూ మంచి నేయి, స్వీట్లు రెండు, మూడు డబ్బాలలో తెచ్చి మాష్టారికిచ్చి, ఆయనను బాగా పొగిడి వెళ్ళేవాళ్ళు.

"అబ్బెబ్బే!" ఎందుకండీ ఇప్పుడివన్నీనూ...' అంటూ మొహమాటంగా తీసుకునేవారు మాష్టారు.

రేఖ ప్రోగ్రెస్ గురించి ఆమె తల్లిదండ్రులడిగితే, "దానికేమండీ బంగారం. ఇట్లా చెప్పగానే అట్టా అల్లుకు పోగలదు" అంటూ ఆకాశానికెత్తేసేవారు రేఖను.

***

స్వరాలు, గీతాలు, వర్ణాలూ, కృతులూ అంటూ నాలుగు విభాగాలుగా విభజించారు విద్యార్థినులను.

తన బ్యాచ్‌లో కొంతమంది తనతో కలిసేదాకా తర్వాత పాఠం చెప్పేవారుకాదు సంగీతకు మాష్టారు.

వృథా కాలయాపనవల్ల నిరాశగా అన్పించేదామెకు. ఆర్థిక ఇబ్బందులు లేనివారు కాలయాపనకు తట్టుకోగలరేమోకానీ, మాష్టారు నేర్పుతున్న సంగీతం త్వరగా ఒంటబడుతున్నప్పుడు ఎందుకలా చేస్తారు మాష్టారు, అనిపించేదామెకు తను నెలనెలా డబ్బు కట్టడానికి ఎంత ఇబ్బందిపడుతుందో గుర్తొచ్చి.

ఈ రోజు పాఠం చెబుతారో లేక సొంతకోలుకబుర్లతో కాలక్షేపం చేస్తారోనని ఏ రోజుకారోజు గండంలా వుండేది కానీ, హాయిగా అన్పించేదికాదామెకు.

వాళ్ళ గేదెల గురించీ, అవి పేడవేసే విధానం గూర్చీ వాళ్ళకు లేకలేక కలిగిన కొడుకు లోకాయి గురించి, సాటి సంగీతం మాష్టార్ల సంగతులూ, ఇలా ఎన్నో అర్థంపర్థంలేని సంగతులతో కాలం గడిపే వారాయన.

ఆయనకు డబ్బులు రావడం ముఖ్యం. దానికై పాఠాలు సాగదీసి కాలాన్ని పొడిగించాలి. అదీ సంగీతలాంటి మధ్యతరగతి వాళ్ళమీదే ఆయన ప్రయోగం. రేఖ లాంటి డబ్బున్నవాళ్ళవద్ద ఆయన పప్పులుడకవు. వాళ్ళంటే భయం. అంటే డబ్బు మీద గౌరవం. డబ్బుల్లేకపోతే దుబ్బుకు కొరగారీ లోకంలో అన్పించేది సంగీతకు.

***

"సరాకేల సరస్వతీ..." పాడుతున్నది సంగీత ఒక రోజు శృతిబాక్స్‌తో శృతివేసుకుంటూ, ఒక్కో సంగతీ విడివిడిగా పలుకుతూ.

అప్పుడే మాష్టారికోసం ఎవరో వచ్చారు. "ఎవరా అమ్మాయి! తారస్థాయిలో పంచమాన్ని అంతచక్కగా అనగల్గుతున్నది. కంఠం కూడా అద్భుతంగా వుంది" అన్నారాయన.

"అనుమంద్ర స్థాయిలో కూడా అంత బాగానూ అనగలదు" అంటారేమో మాష్టారు అనుకున్నది సంగీత. కానీ "ఆ...ఫలానా ఆఫీసులో పనిచేస్తుందీ..." అంటూ నాన్చారు మాష్టారు.

అదే రేఖ లాంటి పలుకుబడీ, డబ్బుగల వారమ్మాయయితే పొగిడి పొగిడి కీర్తించేవారే-"గురువులు పొగడకూడదు. కానీ ప్రతిభగలవారి గూర్చి కాస్త ప్రోత్సాహకరంగా మాట్లాడితే తప్పులేదు కదా' అన్పించిందామెకు.

మాష్టారెప్పుడూ మాటలతో శృంగతీసేవారామెను. "అందంగా, బొమ్మలా వీణ పట్టుకు కూర్చుంటావు కానీ, కదలికే లేదు" అంటూ నిరుత్సాహపరిచేవారు అలా అనాల్సిన అవసరం లేకపోయినా.

వీణమీద పడిపోతూ, పూనకం వచ్చినట్టు ఊగిపోయే కదలికలు ఆమెకయిష్టం. మరీ రాయిలా బిగుసుకుపోకుండా గమనానికి తగ్గట్లు పాడేటప్పుడు కాస్త కదలిక వుంటే చాలని ఆమె అభిప్రాయం.

***


"తెలిసి రామ చింతనతోనామము...", "సామజ వరగమనా...", "ఎంత నేర్చినా", "సంగీతజ్ఞానము... భక్తి వినా,..." మొదలైనవి తనకూ నేర్పమని అడిగింది మాష్టార్ని సంగీత-రేఖా, రాధా, రాణి వాళ్ళకు అవి నేర్పుతుంటే. మాష్టారెంత త్రొక్కిపెట్టినా, కాలయాపన చేసినా ప్రస్తుతం కృతుల విభాగంలోకి అడుగుపెట్టింది కాబట్టి.

"నీకేం వస్తాయవి? సంగీత సముద్రాన్ని అంత తొందరగా ఒక్కసారే మథించాలన్న తొందరయితే

ఎట్లానే నీకు. వాటిల్లో కొన్ని స్పీడుగా పాడాల్సి వస్తాయి. నీవేం పాడగలవు?'' అంటూ నలుగురి మధ్య మాస్టారు చులకనగా మాట్లాడేసరికి అవమానభారంతో తల భూమిలోకి క్రుంగిపోతే బాగుణ్ణనిపించింది సంగీతకు.

సంగీతం మానేస్తే బాగుణ్ణనిపించింది మొదటి సారిగా. టైపు నేర్చుకోవడమూ, ఆఫీసులో పనీ, సంగీతం క్లాసులకు రావడమూ, మళ్ళీ సాధనా క్షణం విశ్రాంతి లేకుండా అయింది. తరచూ జ్వరం వస్తుండేది. తల్లికోప్పడేది సంగీతం మానెయ్యమని. ఆ డబ్బులు దేనికో ఒక దానికి వస్తాయనేది.

***



ఒక రోజు...

కలవారమ్మాయి, ఆస్త్మా పేషెంట్ జానకికి 'రాగాలాపన' ఎలా చేయాలో బోధిస్తున్నారు మేస్టారు. తనకూ హరికాంభోజీ, దేవమనోహరి, ఖమాస్, శుద్ధధన్యాసి, హంసధ్వని, పుష్పలతిక, నాట కురంజి, బేగడ, సారు, శెలి మొదలైన రాగాలలో చాలానే కృతులు నేర్పారు కాబట్టి 'జానకి ఎంత కష్టపడుతున్నదో తనకైతే అలా అన్పించకపోను' అని అనుకున్న సంగీత యింటికి రాబోయే ముందు ''మాస్టారూ! నాకూ నేర్పరా'' అని ఆసక్తిగా, జాలిగా అడిగింది.

''నీకా! అప్పుడే రాగాలాపనా, స్వరకల్పనలూనా! మరో రెండేళ్ళు పడుతుంది నీవా స్టేజీకి రావాలంటే. అయినా నేర్పేవాడిని నాకు తెలీదా! ఎవరికెప్పుడు ఏది నేర్పాలో. నీది మరీ ఆకాశానికి నిచ్చెనలు వేసే వ్యవహారం లాగుందే మాస్తే. ఇట్లా చాలాసార్లు నన్నెదిరించావ్. ఇలా అయితే, నాదగ్గర కుదరదు...మానెయ్యొచ్చు'' గట్టిగా అరిచారు మాస్టారు ఉక్రోషంగా.

'అవును ఎందుకు కుదురుతుంది? నేతి డబ్బాలూ, వగైరాలు మీ ఇంటికి చేరవేయలేదుగా మరి. నేను చక్కగా పాడగలిగినా సాటి వాళ్ళు ఇంకా నేర్చుకోలేదని ఒక్కో విభాగంలో పాతేసి వుంచేవారు. ఏనాడూ ప్రోత్సహించేలా మాట్లాడకపోయినా, వ్యంగ్యపు వాక్కులతో కృంగదీశారు కదలిక లేదు, అది లేదు, ఇది లేదు అంటూ. వృద్ధిలోకి రావాలన్న నా ఆకాంక్షను మీరు ఎప్పటికప్పుడు తుంచుతూనే వచ్చారు. గురువులెప్పుడూ శిష్యుల చురుకుదనాన్ని బట్టి విద్య నేర్పాలిగానీ, వారి ఆర్థిక స్తోమతును బేరీజు వేసుకుని గాదు. శిష్యులు తమను మించిపోతారని ఏ గురువైనా అణగద్రొక్కటం చేస్తే విద్వాంసులెక్కడ తయారవుతారు మాస్టారూ! ఊబిలో కూరుకుపోతారుగానీ...'' అని పైకనలేదు సభ్యత అడ్డొచ్చి. ఆయన మానెయ్యమని తెగేసి అన్న తర్వాత ఇంకా క్లాసులకు రావటమూ కష్టమే. ఉబికి వస్తున్న కన్నీటిని బలవంతాన ఆపుకుంటూ, తడబడే అడుగులతో గేటు బయట వరకూ వచ్చి, ఒక్కసారి వెనుదిరిగి చూసింది మాస్టారివైపు— 'ఇంతవరకైనా కాస్తంత సంగీత జ్ఞానం కలిగించిన మీకు నా కృతజ్ఞతలు. సెలవు' అనే భావన కన్నుల్లో కదలాడగా.




***

సంగీతజ్ఞానమే భగవంతుని దరిచేరే సాధనమని నమ్మి, ఎన్ని ఒడిదుడుకులెదురైనా వివాహం కూడా చేసుకోకుండా శేష జీవితాన్ని సంగీత సాధనలో తరింప చేసుకోవాలనీ, విద్వాంసురాలవ్వాలనీ కలలుగన్న ఆమె ఆశల వటవృక్షం గురువు నిరాదరణతో కూకటి వేళ్ళతో కూలిపోయింది. ●